



అలసట నిండిన మొహంతో, రేగిన జుట్టుతో సూట్‌కేస్ తీసుకొని, విసురుగా కారు దిగుతున్న నమ్రతను చూస్తూ ఆశ్చర్యాందోళనలతో "ఏమయిందే అలా ఉన్నావ్?" అడిగింది వనజ.

"దార్లో కారు ట్రబులిచ్చింది" అంది నమ్రత లోపలికి వచ్చి సోఫాలో వాలిపోతూ.

"అల్లుడుగారు రాలేదా?" అంటూనే మంచినీళ్ళు అందించింది.

"ఏం ఆయనగారు లేకుండా నేను రావడానికి వీల్లేదా?" దూకుడుగా అంది.

"దాల్ మే కుఛ్ కాలా హై" అనుకొంటూ, చూస్తున్న

# మన్నించుమా ప్రియా...

పేపర్లని పక్కకునెట్టి – "నీకీ ఇంట్లో సంపూర్ణాధికారాలున్నాయ్‌రా. ఎప్పుడన్నా, ఎలాగన్నా రావచ్చు, పోవచ్చు. అల్లుడుగారితో కలిసివస్తే సందడిగా వుంటుందని మీ అమ్మ ఆశ... అంతేరా!" అన్నాడు వెంకట్రావ్ కూతురి చేయి మీద చేయి వేసి నిమురుతూ.

"ఆయనగారికి పెళ్ళాం ఎందుకు? ఊరి జనాల్ని పట్టించుకోవడానికే ఎక్కడలేని టైమూ చాలడం లేదు" అంటూ బాత్‌రూంలో కెళ్ళింది నమ్రత. వనజా, వెంక్రటావులు ఒకరి మొహం ఒకరు చూసుకొన్నారు ప్రశ్నార్థకంగా.

"ఒక్కగా నొక్క కూతురని ఓ... తెగ గారాబం చేసారు. చూసారా? మళ్లీ దేనికి అలిగిందో? పాపం కుర్రాడు మంచాడు కాబట్టి దీన్ని భరిస్తున్నాడు" అంది వనజ నెమ్మదిగా.

"ఉష్! గట్టిగా అనకు. దానికై అది చెప్పే వరకూ ఏమీ అడక్కు" అన్నాడు వెంకట్రావ్ **కూతురి** మనసు నొచ్చుకోకూడదని.

'సరిపోయింది సంబరం...' విసుక్కొంది వనజ.

కూతురు పుట్టాకే తనకి జాబ్ వచ్చిందని, అనుకోకుండా ఆస్తి కలిసి వచ్చిందనీ, ఆ తర్వాత నమ్రత పేరిట స్టార్ట్‌చేసిన బిజినెస్ బాగా పుంజుకోవడం జరిగిందనీ నమ్రతంటే పంచప్రాణాలాయనకి. నమ్రత నోరుతెరిచి 'ఇది కావాలి' అని అడక్కముందే అమర్చడంలో ఎనలేని తృప్తి పొందుతూ ఉంటాడాయన. అల్లుడూ మంచివాడు కావడంతో అల్లుడు నరేష్ అంటే చాలా అభిమానం. నమ్రత అతడితో పోట్లాడి కంప్లైట్ చేసినప్పుడల్లా – అతని తప్పులేకున్నా నమ్రత తృప్తికోసం నరేష్‌కి నచ్చజెప్పి, రాజీ చేస్తుంటాడు. అందుకు నరేష్ కూడా అలవాటుపడిపోయాడు. అతనికి నమ్రత మీద వెంకట్రావ్ చూపించే ప్రేమ ఆశ్చర్యం కల్గిస్తూంటుంది. ప్రేమ గుడ్డిదే కాదు, చెవిటిది కూడా. తండ్రయ్యాక, తనూ ఫ్యూచర్‌లో అలాగే అవుతానేమో అనుకుంటూ ఉంటాడు. గారాబంగా పెరిగిన నమ్రత తనవాళ్లు తనకుగాక మరెవరికి ప్రిఫరెన్స్ ఇచ్చినా భరించలేదు. అల్లుడు తన బిజీ వల్లనో లేక సహజంగా అతనికున్న అలవాటుకొద్దీ ఎవరికైనా సహాయపడడానికి వెళ్లిఉంటేనో... నమ్రత అలిగి, వచ్చిఉంటుందని వెంకట్రావ్ భావించాడు. అయితే వారం గడిచినా నమ్రత 'విషయం ఇదీ...' అంటూ చెప్పకపోయేసరికి కొంచెం కంగారన్పించింది. ఉషారుగా, గలగలా పారే సెలయేరులాంటి కూతురు అలా ఉదాసీనంగా ఉండడాన్ని తండ్రి హృదయం భరించలేకపోతోంది.

**వాలి హిరణ్మయీదేవి**

అందుకే ఆఫీస్‌కి వెడుతూ "ఒరేయ్! సా యంత్రం తొందరగా వచ్చేస్తాను రెడీగా ఉండు. ఎగ్జిబిషన్‌కి వెడదాం" అని చెప్పాడు.

ఆలోచనలతో సతమతమవుతున్న నమ్రతకి, అంత బిజీగా ఉండే తండ్రి ఓ సాయంత్రాన్ని పూర్తిగా తన కోసం, తన మనోల్లాసం కోసం కేటాయిస్తాననడం చాలా ఊరట కలిగించింది. అందుకే ముస్తాబై లాన్‌లో తిరుగుతూ... ఎదురు చూడసాగింది.

గంటన్నర తర్వాత వనజ హడావుడిగా లోప ల్నుంచి వచ్చి "అమ్మా! మీ నాన్న ఉన్నపళంగా నన్ను రమ్మని ఫోన్ చేసారు. నీకు తోడుగా ఉం డేందుకు మీ ఫ్రెండ్ లతని రమ్మన్నాను. వంట చేసి ఉంచాను. ఇద్దరూ తినండి. మేం వచ్చేటప్ప టికి ఎంత సేపవుతుందో ఏమో...? మీరు తిని పడుకోండి. మధ్యలో ఫోన్ చేస్తాలే... అంటూ గబగబా వెళ్ళి కార్లో కూర్చుంది.

తల్లి వెళ్లిపోగానే మరీ లోన్లీగా ఫీలైంది నమ్రత. కొంచెం రిలాక్స్‌డ్ మూడ్‌లోకి రాబో యిన ఆమె మళ్లీ మూడీగా మారిపోయింది. లత రాలేనని ఫోన్ చేసి చెప్పడంతో టీ.వీ. ముందు కూలబడింది. టీ.వీ.లో ఏదో సినిమా వస్తూంటే అప్రయత్నంగా అటు దృష్టిని మళ్లిం చింది. తను సాయపడ్డ వ్యక్తి కృతజ్ఞతలు చెప్ప బోతే వద్దని వారిస్తున్న హీరోని చూస్తూంటే... ఆమెకు నరేష్ గుర్తుకొచ్చాడు. అంతే... టక్కున టీవీ ఆఫ్ చేసింది.

ఆ రాత్రి వనజా, వెంకట్రావ్‌లు ఇంటికి రాలేదని మర్నాడు తొమ్మిదింటికి నిద్రలేచిన నమ్రతకు తెలిసి... కంగారుపడింది. మరో అరగంట తర్వాత వచ్చారిద్దరూ అలసిన మొహా లతో. కంగారుగా ఎదురెళ్లి... 'ఏమైంది నాన్నా?' అంటూ అడిగింది.

"రాజారావ్ అంకుల్ ఇంటికి వెళ్లాల్సి వచ్చిం ది... అంటూ బాత్‌రూమ్‌లోకి వెళ్లిపోయాడు వెంకట్రావ్.



రాష్ట్రస్థాయి శతాధిక మహిళా కవి సమ్మేళనం ప్రారంభసభలో అధ్యక్షోపన్యాసం చేస్తున్న రచయితల సంఘం అధ్యక్షుడు శ్రీ సోమేపల్లి వెంకటసుబ్బయ్య. చిత్రంలో ఆకాశవాణి స్టేషన్ డైరెక్టర్ శ్రీ మంగళగిరి ఆదిత్యప్రసాద్, ప్రముఖ కవయిత్రులు డా॥ చిల్లర భవానీదేవి, శ్రీమతి ఎన్. అరుణ, కేంద్రసాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డా॥ ఎన్. గోపి, నేటినిజం ఎడిటర్ శ్రీ బైసా దేవదాసు, నె.ర.సం., ప్ర.ర.సం., గు.ర.సం. ప్రధానకార్యదర్శులు పి. రామకృష్ణ, పి. వెంకట శ్రీనివాసులు, కె. రవికుమార్‌లు వున్నారు.

ఏ విషయాన్నయినా తనకి వివరంగా చెప్పే తండ్రి అలా బాధగా వెళ్లిపోవడంతో తల్లి దగ్గరకు వెళ్ళి 'ఏమైందమ్మా? నువ్వైనా చెప్పమ్మా...' అంది ఆదుర్దాగా.

ఆమె దీర్ఘంగా నిట్టూర్చి "ఏమైందేంటి? కాస్తలో ఇద్దరి ప్రాణాలూ దక్కాయి. రవి గనుక బతకకపోతే, రాజారావ్ అంకుల్ గుండె ఆగిపోయేది. రవి సూసైడ్ చేసుకోబోయాడు. సమయానికి వైద్యం అందడంవల్ల బతికాడు. ఈలోగానే తట్టుకోలేక అంకుల్‌కి హార్ట్‌ఎటాక్ వచ్చింది" అందామె.

ప్రశ్నార్థకంగా చూసింది నమ్రత.

"రవికి, అతని భార్య రవళికీ చాలా రోజుల నుంచి పడటంలేదు. ఇటు భార్యకి, అటు తల్లికీ నచ్చజెప్పలేక నలిగిపోయాడు. ఇద్దరికిద్దరే మొండి పట్టుదలలు. నాలుగునెలలక్రితం రవళి అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. విరక్తితో, నలుగురూ నాలుగు రకాలుగా అనే మాటలు తట్టుకోలేక రవి ఇలా అఘాయిత్యానికి పాల్పడ్డాడు" చెప్పింది వనజ.

నమ్రత మనసంతా చేదుగా మారిపోయింది.

ఏమీతోచక, తన ఫ్రెండ్ రూపకి ఫోన్‌చేసి ఆమె ఇంటికి బయల్దేరింది. నమ్రతని సాదరంగా రిసీవ్ చేసుకొంది రూప. తనని చూసి ఎంతో ఎగ్జైట్ అవుతుందనుకొన్న నమ్రతకు కాస్త డిసప్పాయింట్‌మెంట్ కల్గినా, చిక్కిశల్యమైన రూపను చూస్తూ 'అత్తింటి ఆరళ్లో... శాడిస్ట్ మొగుడో...' అనుకొంటూ...

"ఏంటే? మరీ ఇలా అయ్యావ్? అంది కాస్త ఆదుర్దాగా.

ఆ మాటలతో రూప బుగ్గల్లో గులాబీలు పూసాయ్. 'ఏముంది? వేవిళ్లు' అంది నవ్వుతూ.

తనకు పెళ్లయిన రెండేళ్లకు రూప పెళ్లి జరిగింది. "పెళ్లై మూడ్నెల్లైనా కాలేదు కదే? అప్పుడే ఈ జంఝాటం ఎందుకు? ప్లాన్ చేసుకోలేదా?" అంది నమ్రత.

"ఆయనకి పిల్లలంటే చాలా ఇష్టమే. అదీగాక ఇరవైనాల్గు, ఇరవైఐదుల మధ్య ఆడపిల్ల తల్లయితే మంచిది. ఆ తర్వాతైతే కాంప్లికేషన్స్ వస్తాయని..." అంటూ నవ్వింది రూప.

"మనింట్లో పసిపాప తారాడుతూంటే ఎంత బాగుంటుందో ఊహించు" అంటూ కలల్లో తేలిపోయే నరేష్ గుర్తుకొచ్చాడు.

"అందుకా ఇలా చిక్కిపోయావ్? మరి మీ ఆయనేం పట్టించుకోడా?"

"పట్టించుకోకపోవడమా? నేను వాంతి చేసుకొన్నప్పుడల్లా ఆయనెంతగా అల్లాడిపోతారో తెలుసా? తనో డాక్టరైనా, ఓ సగటు మగవాడిలా నా కోసం బాధపడిపోతారు. ఎంతో అపురూపం చేస్తారు. నిజానికి ఆయనకి ముక్కుమీదుంటుంది కోపం. అలాంటిది నా కోసం ఆ కోపాన్ని కంట్రోల్ చేసుకొన్నారు. కోపంలో అరిచినా, ఆ తర్వాత ఎంత బాధపడతారో... ఎన్నిసార్లు 'సారీ' చెబుతారో తెలుసా?" అంది రూప తన్మయంగా.

"అవునే... మీవారు డాక్టర్‌కదా? మరి నీ కోసం టైమ్ కేటాయిస్తారా? అదే... తన వృత్తి కన్నా నీకెక్కువ ఇంపార్టెన్స్ ఇస్తారా? లేక హాస్పటల్లో అంటూ అక్కడే పాతుకుపోతాడా? అడిగింది క్యూరియాసిటీతో.

"ఒక్కోసారి మేమిద్దరం ఎక్కడికన్నా వెళ్లినపుడు కూడా మధ్యలో ఫోన్‌కాల్స్ వస్తాయి. నేనే అర్థం చేసుకొని నచ్చజెప్పి పంపిస్తాను. అందుకాయన నాపట్ల ఎంత కృతజ్ఞతతో, మరెంత ప్రేమతో ఉంటారో తెలుసా? "నన్ను అర్థంచేసు

కొన్న భార్య దొరకడం నా పూర్వజన్మ సుకృతం అంటారు" అంది మురిపెంగా.

రూపకన్నా ఆమె భర్త హరి అన్నివిధాలా బావుంటాడు. నిజానికి రూప 'కాకి' అయితే హరి 'దొండపండు' అని చెప్పొచ్చు. కానీ అలాంటి ఫీలింగ్ లేకుండా పైగా 'రూప దొరకడం' తన అదృష్టంగా అతడు భావిస్తున్నాడంటే రూపదెంత భాగ్యం?... ఎందుకో మనసులో జెలసీగా అన్పించింది నమ్రతకి. సంశయిస్తూనే "అవునే... నీబర్త్‌డేకి ఎక్కడికన్నా వెళ్లాలని ప్లాన్ చేసావనుకో... మీవారు వస్తానని చెప్పి, రాకపోతే అది నిన్ను నిర్లక్ష్యం చేసినట్లుగా నీకన్పించదా?" అంది.

"ఎందుకన్పిస్తుంది? ఆయనకు నామీద ఎంత ప్రేమ ఉంటుందో నాకు తెలియంది కాదు కదా! ఆ అవతలి పని ఎంతో అర్జెంట్‌దైతేనే రాలేకపోయి ఉంటారుగదా అని అనుకొంటానంతే..." అంది రూప ఎంతో మామూలుగా.

ఇక ఏమీ మాట్లాడలేకపోయింది నమ్రత.

రూప ఇంటి నుంచి తిరిగి వచ్చినా, రూప మాటలే నమ్రత చెవిలో గింగురుమనసాగాయి. ఆ రాత్రి మంచం మీద వాలినా, తను బయల్దేరి వచ్చేముందు జరిగిన సంఘటనే కళ్లముందు కదలాడసాగింది.

"మన మ్యారేజ్‌డేకి సాగర్‌కి వెడదామని, ఎత్తిపోతల జలపాతం వెళ్లి ఎంజాయ్ చేయాలని ఎంతగా, ఎన్నాళ్లుగా అనుకొన్నానో మీకు తెలిసి కూడా ఆనంద్‌కి ఏక్సిడెంటైందని కేన్సిల్ చేసేసారు. ఏం? ఆనంద్‌కి మీరు తప్ప వేరే స్నేహితుల్లేరా? బంధువుల్లేరా? అన్నిటికీ నేనున్నానంటూ వెళ్లకపోతేనేం? మన ప్రోగ్రామ్ గురించి మర్చిపోయారా? అసలు మీకు నా మీద ప్రేమ తగ్గిపోతోంది రోజురోజుకీ. అందుకే 'దీనిమాటకేం విలువివ్వాలిలే... అంటూ నిర్లక్ష్యం చేసారు" కోపంగా అంది నమ్రత.

"పండూ... నువ్వలా మాట్లాడితే నాకు చాలా బాధగా ఉంటుంది. ఎప్పుడూ గొడవపడ్డానికే చూస్తావ్ తప్ప - అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేయవేం?" అన్నాడు నరేష్.

"ఏం ఎంతసేపూ నేనే అర్థం చేసుకోవాలా? మీరు నాకసలు ఇంపార్టెన్స్ ఇవ్వడం మానేసారు. నా చిన్న కోరికను కూడా తీర్చాలన్పించదా? ఆవేశంగా అడిగింది నమ్రత.

"నీ కోరిక తీర్చడానికేగా - ఎంత బిజీగా ఉన్నా ప్రయాణానికి అన్ని అరేంజ్‌మెంట్సూ చేసింది. కానీ అప్పుడే ఆనంద్‌కి ఏక్సిడెంటైంది మరి. నీకు తెలుసుగా అనంద్‌ది లవ్‌మారేజి, అటు వాళ్లు, ఇటు వాళ్లూ పట్టించుకోరని. చావు బతుకుల్లో కొట్టుమిట్టాడుతున్న వాడినెలా వదిలిపెట్టి రాగలను? కణతలు రుద్దుకొంటూ అడిగాడు నరేష్.

"ఏం మీ కొక్కరికే పట్టిందా? మీరు నలుగురూ ప్రాణ స్నేహితులుకదా? మిగతా ఇద్దరేమయ్యారు? కినుకగా అంది.

"హరి ఊళ్లో లేడు. సుధాకర్ ఫోన్ కలవలేదట".

"వాళ్లు తెలివైన వాళ్లులెండి... అలా చెప్పి తప్పించుకొని ఉంటారు. మీరే ప్రతిదానికీ నేనున్నానంటూ బయల్దేరతారు" చిరాగ్గా అంది నమ్రత.

నమ్రత అనే పేరు ఎందుకు పెట్టారోగానీ ఎప్పుడూ దానికి విరుద్ధంగా ఉంటుందనుకుంటూ "నమ్రతా! బాగా అలిసిపోయి వచ్చాను. ఓ కప్పు కాఫీ అయినా ఇవ్వకుండా ఈ ఇంట

రాగేషనేంటి? ఇంటికి రావాలంటేనే భయపడా ల్సి వస్తోంది" అసహనంగా అన్నాడు నరేష్.

"అవును... పాపం చాలా భయపడుతున్నా రు. నేనో మహారాక్షసిని. అంతేగా... ఏడుస్తూ అంది నమ్రత.

"ఛ... ఇంత చిన్న విషయానికి గొడవెందు కు?

నన్నింత నిర్లక్ష్యం చేస్తుంటే ఎంతకాలమని భరించను? మా నాన్న పెద్ద బిజినెస్ మాగ్నెట్ అయినా ఏనాడూ ఏ చిన్న విషయంలోనూ నన్ను నెగ్లెక్ట్ చేయలేదింతవరకూ. మొన్నటికి మొన్న జ్వరంతో నేబాధపడుతూ హాస్పిటల్‌కి తీసుకెళ్లమంటే తీసుకెడుతూ పక్కింటివాళ్ల కుక్కపిల్ల కాలు విరిగిందని దాన్ని తీసుకొచ్చారు. అంటే మీ దృష్టిలో అదీ, నేనూ సమానమనేగా? అంతకుముందు అమ్మానాన్నల పెళ్లిరోజు ఫంక్ష న్ గ్రాండ్‌గా సెలబ్రేట్ చేస్తున్నారని రమ్మంటే, సునామీ బాధితుల సహాయార్థం విరాళాలకి బయలుదేరారు. అంటే మేం తప్పించి మిగతా వాళ్లే మీక్కావలసిన వాళ్లన్నమాట...

"పండూ! అనవసరంగా పాత విషయాలన్నీ తవ్వి గొడవ పెద్దది చేస్తున్నావ్. మనిషికి మనిషి సాయపడకుంటే ఇక జీవితానికి అర్థం ఏముం ది? మన సరదాల కోసం సృష్టించుకొన్న ఫంక్ష న్స్ ఎప్పుడన్నా మళ్లీ ఏర్పాటు చేసుకోవచ్చు. కానీ అనుకోకుండా వచ్చే ఆపదలకు లోనయ్యే వాళ్లకి 'సత్వర సహాయం' అవసరం కదా. ఏ రోజు ఎలా ఉంటుందో, ఎప్పుడు ఎవరితో మన కు అవసరం పడుతుందో... నలుగురితో కలిసి మెలసి ఉండాలెప్పుడూ".

"చాలించండి... నాకెప్పటికీ ఒకరిసాయం అవసరమయ్యేరోజు రాదు. అలాంటి ఖర్మేం పట్టదు. నాకంటూ నా వాళ్లున్నారు. వాళ్లు నన్ను కళ్లలో పెట్టుకొని చూసుకొంటారు. మీరూ అలా చూసుకోగలననుకొన్నరోజు వచ్చి నన్ను తీసు కెళ్లండి... అంటూ చరచరా బైటకొచ్చి, నరేష్ వారిస్తున్నా వినకుండా కారెక్కి వచ్చేసింది.

'నమ్రతా, అంటూ లోపలికి వచ్చిన వనజ పిలుపుతో ఈ లోకంలోకి వచ్చింది.

"నమ్రతా! నీకోసం నరేష్ ఇప్పటికే నాలు గైదుసార్లు ఫోన్ చేశాడు. క్షేమంగా చేరావో లేదో నని కంగారుపడుతున్నాడు పాపం. విషయం ఏమిటీ అని అడిగితే అతనూ చెప్పడు, నువ్వూ చెప్పవు. నువ్వు సరదాకొద్దీ వచ్చి ఉంటే మాకు సంతోషంగా ఉంటుంది. వచ్చి ఇలా నిర్లిప్తంగా బాధగా ఉంటే మాకెలా ఉంటుందో ఊహించు. మీ నాన్నగారు నీ గురించిన ఆలోచనలతో నిన్న సరిగ్గా డ్రైవ్ చేయలేకపోయారంటే ఆలోచించు. నరేష్ గురించి తెలిసిందాన్ని కాబట్టి చెబుతు న్నా... నీ ప్రవర్తనని నువ్వు తరచి చూసుకో. నేనిలా నిష్కర్షగా మాట్లాడతాననేగా... నాతో గాక, అన్నీ మీ నాన్నకే చెప్పుకొంటావ్. కానీ ఒక్కటి గ్రహించు. కన్నతల్లిగా నీ మంచి కోరు కొనేవాళ్లలో నేనే మొదటిదాన్నని తెలుసుకో..." అనేసి వెళ్ళిపోయింది వనజ - నమ్రత నుంచి ఏ సమాధానమూ ఆశించకుండా.

తల్లి మాటలతో ఆలోచనలో పడింది నమ్రత.

"పెంకిఘటంగా పేరుపొందిన రూప కోపి ష్టి భర్తనర్థంచేసుకొని సుఖంగా ఉంది. మరి... మంచికి మారుపేరు, శాంతానికి ధర్మమూర్తిని తలపించే నరేష్‌తో తనెందుకు సంతోషంగా ఉండలేకపోతోంది?"

ఎదురింటమ్మాయ్ నాల్గుసార్లు నరేష్ కోసం వస్తే... నీచంగా వాళ్లిద్దరినీ అనుమానించేంత వరకూ వచ్చింది. కానీ ఆ తర్వాతే తెలిసింది...

వాళ్లు ఊరు వెడుతూ వాళ్ల కుక్కపిల్లని, ప్రాణ ప్రదంగా పెంచుకొనే తోటనూ ఓ కంట కనిపెట్టి ఉండమని చెప్పేందుకు వచ్చిందని. తన అనుమానం గురించి చెబితే నవ్వేసి, "పిచ్చిదానా? నీకు చెప్పాలంటే భయపడి, ఆ పిల్ల నాకా బాధ్యత అంటగట్టిందంతే... నాకు గార్డెనింగ్ అంటే ఎంత ఇష్టమో వాళ్లకు తెలిసిందే కాబట్టి అడిగారు. అందుకు ఈ పిచ్చి అనుమానాలా? అందుకే బుర్రని ఖాళీగా ఉంచుకోవద్దంటారు" అని తేలిగ్గా నవ్వేసాడే తప్ప రాద్ధాంతం చేయలేదు. తనకు చికెన్‌గున్యా వచ్చినప్పుడు తన తల్లిదండ్రుల్ని బాధపెట్టడం దేనికని, తను చెబుతానన్నా వద్దని వారించి, కుడీ, ఎడమచెయ్యాని చూడకుండా సేవలు చేసాడు. తరచి చూస్తే తనొక్కనాడూ అతనికి ఏ చిన్న సేవనీ చేయలేదని గుర్తుకొచ్చింది. అలాంటి వాడి మీద అలిగి వచ్చిన తను నిజంగా ఎంత మూర్ఖురాలు? ఏ పసిపాపకైనా గుండెజబ్బులనో, మరొకటనో వార్తలు విన్నా, చదివినా తనవంతుగా ఎంతో కొంత పంపించందే ఉండడు. తోచినంత సాయం చేస్తేనే మానవత్వం పచ్చగా పదికాలాలపాటు ఉంటుంది అంటాడు. మనిషి చేసే పుణ్యం, ఉపకారం... అతనికేకాక అతనికి సంబంధించిన వాళ్లనీ ఆదుకొంటుందని నమ్మే మనిషి. ఆఖరికి అదే తన విషయంలో నిజమైంది కదా! తను కార్లో వస్తూంటే అకస్మాత్తుగా కారు



మానస సాహిత్య సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో విజయవాడలో దసరా కవితా సౌరభాల పుస్తకావిష్కరణ, మానస అవార్డ్ సభలో శ్రీమతి ఉయ్యూరు సత్యవతిని 2007 'ఉత్తమ సేవా మహిళ' అవార్డ్‌తో సత్కరిస్తున్న ప్రముఖ కవయిత్రి శైలజామిత్ర, సంస్థ అధ్యక్షులు సిహెచ్. వి. ఎస్. బ్రహ్మానందరావు.

చెడిపోయింది. నిర్జన ప్రాంతంలో తనొక్కతే ఉండి, వణికిపోతూంటే... ఎవరో దారినపోయే దానయ్య కారు రిపేర్ చేయబట్టేగా... తను సురక్షితంగా చేరగలిగింది? నరేష్ చేసిన పుణ్యమేగా తనను కాపాడింది? ఆ విషయం తట్టగానే ఇక ఆగలేకపోయింది నమ్రత.

"అమ్మా! నేను మా ఇంటికి వెడుతున్నా" అంటూ కారెక్కుతున్న నమ్రతను చూస్తూ "దీనికి పసితనం ఎప్పుడు వదుల్తుందో ఏంటో" అనుకొంటూ నవ్వుకొంది వనజ.

* * *

తన బాగ్‌లో ఉన్న 'కీ' తో డోర్ తెరిచి లోపలికి వెళ్ళింది నమ్రత. గబగబా బెడ్‌రూం నీట్‌గా సర్ది, సెంట్ స్ప్రే చేసి, నరేష్ కిష్టమైన చీర కట్టుకొని తయారైంది. అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకొని సంతృప్తిపడి, అతని రాక కోసం నిరీక్షించసాగింది. రూమ్‌లో అటూ ఇటూ తిరుగుతూంటే నరేష్ డైరీ కన్పించింది. మరొకరి డైరీ వారి పర్మిషన్ లేనిదే చదవకూడదన్న నరేష్ మాటలు గుర్తొచ్చినా తన ఆబ్సెన్స్‌లో అతనెలా ఫీలయిందీ తెల్సుకోవాలన్న కోరిక దానిని డామినేట్ చేయడంతో ఒక్కోపేజీ చదవసాగింది. పౌర్ణమినాటి అలల్లా పశ్చాత్తాపం చెలరేగసాగింది దానిని చదువుతూంటే. తన ఆబ్సెన్స్ "జీవితేచ్ఛని నశింపచేస్తోందని" అతడు రాసింది చదివి... సూసైడ్ చేసుకొన్న రవి గుర్తొచ్చి ఒక్కసారిగా ఒళ్ళు జలదరించింది.

"నీవు లేని చోటున నాకు చోటు లేదు,
సుఖము లేదు – లేదు
నా నిదురించు శయ్యాగృహమ్ము
నీవులేక నాకు పచ్చి శూన్యమ్ము"

కవి నిజంగా ఎంత అనుభవంతో రాసిన వాక్యాలో గానీ, నమ్రత లేని ఈ ఇల్లూ, నా మనసూ బావురుమంటున్నాయి అంటూ మనోవేదనంతా నింపాడా పేజీలో.

మరో పేజీలో వయసులో నాకన్నా చాలా చిన్నదవడం వల్లనో, అతిగారాబంవల్లనో గానీ నమ్రతలో పెంకెతనం జాస్తి అవుతోంది. ఎప్పుడూ తన కళ్ళముందే ఉండాలంటే ఎలా కుదుర్తుంది?

మరోపేజీలో "బీరువాలోని కాష్ అంతా కాషియర్ కిచ్చి పంపిన వెంటనే రంగమ్మవచ్చి ఆమె కూతురి డెలివరీ ఖర్చుకు డబ్బు కావాలంటూ అడిగింది. దాంతో నమ్రత దేవుడిహుండీలో వేసిన డబ్బునామెకివ్వాల్సి వచ్చింది. దేవుడి డబ్బుని అలగా జనానికిస్తావా? అంటూ పోట్లాడింది. ప్రాణాలకు తెగించి ఓ జీవికి జన్మనిచ్చే తల్లిలో 'అలగాతనాన్ని' ఎలా చూడగలను? సర్ది చేప్పేసరికి తలప్రాణం తోకకొచ్చింది.

మరో పేజీ తిరగేయబోతూంటే ఫోన్ రింగయింది. డైరీమూసి వెళ్ళి, "హలో" అంది. నేను అనంద్ అత్తగారినమ్మా. సమయానికి మీరు సాయం చేయబట్టి నా అల్లుడు, నిండునెలలతో ఉన్న నా కూతురూ నాకు దక్కారు. పెద్దదాన్నయి నా నీకు చేతులెత్తి నమస్కరిస్తున్నానమ్మా...

"నేను చేసిందేమీ లేదాంటీ" అంది నమ్రత సిగ్గుతో.

"ఇంట్లో భార్య కోపరేషన్‌లేందే ఏ భర్తా ఇలా ఆదుకోలేరుగదా తల్లీ! మీ మంచితనానికి, మానవత్వానికీ నా జోహార్లు. మీరు పదికాలాల పాటు చల్లగా ఉండాలి" అంటూ పెట్టేసిందామె.

ఆ మాటలతో ఇంకా నమ్రతలో ఏమూలనో ఉన్న మబ్బుతెరలు పూర్తిగా తొలగిపోయి, ఆమె మనస్సు నరేష్ రాకకోసం మరింత ఆతృతగా ఎదురుచూడసాగింది. ●